ప్రజాశక్తి
మంగళవారం 31 డిసెంబర్ 2024 5
శ్రీ సత్యసాయి





హిందూపురంలో నిరసన ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

'కొత్త' భారం..!

ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా జనంపై కొత్త భారం వేస్తోంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ఫీజును పెంచుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని పాలనాపరమైన ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులకు అందించింది. భూములు, స్థలాలు, ఇళ్ల క్రయ, విక్రయాలపై రిజిస్ట్రేషన్ల భారం పడనుంది. కమర్షియల్ ఏరియాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు ఛార్జీలు కొనుగోలుదారులు చెల్లించాల్సి ఉంది. నూతన పాలసీప్రకారం భూముల విలువ 10 నుంచి 15 శాతం పెరగనుంది. కొత్త ఏడాది నుంచి పెంచిన రిజిస్ట్రేషన్ ఛార్జీలు అమల్లోకి రానున్నాయి.





◆ ప్రజలపై రిజిస్ట్రేషన్ ఛార్జీల వడ్డన
◆ రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం
◆ ఇప్పటికే ఛార్జీల భారం అదనం అంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న మండలాల్లో భూముల క్రయవిక్రయాలు భారీగానే జరుగుతుంటాయి. ముఖ్యంగా అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ తదితర ప్రాంతాల్లో భూముల విలువ భారీగానే ఉన్నాయి. వీటి పరిధిలో రియల్ ఎస్టేట్ రూపంలో అమ్మకాలు కూడా జోరుగానే జరుగుతుంటాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఒకే సారి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు అమల్లోకి రానుంది. గత ప్రభుత్వ విధానంలో మాదిరిగా భూముల రిజిస్ట్రేషన్లలో అసమానతలు లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. నిర్ణయం ఏదైనా జనంపై మాత్రం భారం తప్పడం లేదు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు, భవన నిర్మాణాల విలువను కూడా పెంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని దాదాపు అన్ని భూములపై 10 నుంచి 15 శాతం ఛార్జీలు అదనంగా పెరగనున్నాయి.

15 శాతం పెంపుదల ఇలా..

ప్రస్తుతం ఎకరా ధర రూ.22 లక్షలు ఉంటే ఆ భూమిని బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7.5 శాతం అంటే రూ. 1.65 లక్షలు వసూలు చేస్తారు. రాబోయే కాలంలో ప్రభుత్వం 15 శాతం భూమి విలువ పెంచితే ఈ ప్రాంతంలో ఎకరాకు అదనంగా రూ. 3.30 లక్షలు చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు ఎకరా విలువ రూ.25.30 లక్షలు అవుతుంది. ఈ విధంగా చూస్తే దీనిపై రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఎకరానికి రూ.1,89,750 అవుతుంది. అంటే రిజిస్ట్రేషన్ చెల్లిస్తున్న దాని కంటే ఎకరానికి అదనంగా రూ.24,750 కట్టాల్సి ఉంది. రూ.50 లక్షలు విలువైన ప్లాట్ కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.4 లక్షలు. ఇప్పుడు దాని విలువ 30 శాతం పెరిగితే రిజిస్ట్రేషన్ ఛార్జీలు అదనంగా రూ.2.50 లక్షలు అంటే రూ.6.50 లక్షలు కట్టాల్సి వస్తుంది. రూరల్ ప్రాంతంలో రూ.30 లక్షల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రస్తుతం రూ.2.40 లక్షలు అవుతుండగా, అవి 2 లక్షలకు పెరగనున్నాయి. ఇలా అన్ని చోట్లా భూముల విలువను బట్టి రేట్లు భారీగా పెరగనున్నాయి.



క్రయ,విక్రయాలపై ప్రభావం

ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో కొందరు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు పొలాలు, స్థలాలను అమ్మకాలు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ల ఛార్జీలు తరచూ పెరుగుతూ పోతుండడం ఈ ప్రభావం భూముల క్రయవిక్రయాలపై పడుతోతంది. రిజిస్ట్రేషన్ల ఛార్జీల భారంతో అమ్మకాలు బాగా తగ్గిపోతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ల ఛార్జీల పెంపుతో మరింత పతనం అవుతుందని వారు భావిస్తున్నారు. కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం ఛార్జీల పెంపు నిర్ణయంతో కుప్పకూలిపోయే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ, రిజిస్ట్రేషన్ల ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.

సాధారణ కార్యాలయంలా రిజిస్ట్రేషన్ శాఖ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ కూర్చొనే కూర్చీ, అక్కడి పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో సబ్‌రిజిస్ట్రార్లు న్యాయమూర్తుల తరహాలో కూర్చొనే విధానానికి స్వస్తి పలికి సాధారణ అధికారి వల్లే కూర్చీ, టేబుల్‌ను ఉంచే ఏర్పాటు చేశారు. ఫ్రెండ్లీ రిజిస్ట్రేషన్ల కోసం ఈ పద్ధతి తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలియజేస్తోంది.

అమిత్‌షా వ్యాఖ్యలపై..

భగ్గుమన్న వామపక్షాలు

◆ జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు
◆ మంత్రిపదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై వామపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. మంత్రి పదవి నుంచి ఆయన్ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలిపి అమిత్‌షా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమిత్‌షా కేంద్ర మంత్రిగా ఉంటూ పార్లమెంట్ సాక్షిగా 'అంబేద్కర్..అంబేద్కర్.. అంబేద్కర్... ఇన్ని సార్లు దేవున్ని స్మరిస్తే స్వర్గం ప్రాప్తిస్తుంది' అని మాట్లాడిన తీరు అత్యంత హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తాం.. పున:సమీక్ష చేస్తామని బిజెపి చెబుతున్న మాటల్లో భాగంగానే అంబేద్కర్‌పై ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేసినట్లు ఉందన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నా ప్రధాని మోడీ కనీసం నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని వామపక్ష పార్టీల నాయకులు స్పష్టం చేశారు.

వార్త 6లో

వార్త 6లో

వినతులకు సత్వర పరిష్కారం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ఆర్థికపరమైన, కోర్టు కేసులకు సంబంధించిన వాటికి మినహా ప్రజలు అందించే మిగతా వినతులకు సత్వర పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారధి, ఉమ్మడి జిల్లాల జడ్పీ డిప్యూటీ సిఇఒ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డితో పాటు జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి 228 అర్జీలను స్వీకరించారు. అనంతరం వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా జిల్లా, మండల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి గ్రామాల్లో పర్యటించేప్పుడు ఆ గ్రామాలకు సంబంధించిన పిజిఆర్ఎస్ వినతులను కూడా తీసుకుని వస్తారని, ఎలాంటి పరిష్కారం జరిగిందోనని అర్జీదారులతో కూడా మాట్లాడతారని తెలిపారు. పిజిఆర్ఎస్ వినతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి అధికారులు ఆ మేరకు వాటికి పరిష్కారం చూపాలన్నారు. కలెక్టరేట్ పిజిఆర్ఎస్‌లో అర్జీలను అందజేయడానికి వచ్చే వారి కోసం సోమవారం ప్రత్యేకంగా కుర్చీలను ఏర్పాటు చేశారు. డివిజనల్ వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి వారు అర్జీలు అందించే ఏర్పాటును అధికారులు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీగా శెట్టిపి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీగా శెట్టిపి జయచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి ధర్మవరం పట్టణానికి చెందిన శెట్టిపి జయచంద్రా రెడ్డిని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శెట్టిపి జయచంద్రారెడ్డి ధర్మవరం పట్టణం నుంచి మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు వరుసగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా ధర్మవరం పట్టణంలో బాస్కెట్‌బాల్ క్రీడాభివద్ధికి 22 సంవత్సరాల నుంచి ప్రోత్సాహం అందిస్తున్నారు. ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారులను తయారు చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ, రాష్ట్రస్థాయిలో పాల్గొనే శిక్షణ ఇస్తున్నారు. జయచంద్రారెడ్డి ఎంపికపై ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లాతో పాటు అసోసియేషన్ సభ్యులు, యుటిఎఫ్ నాయకులు, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సమిష్టిగా విధులు నిర్వహిద్దాం : ఎస్పీ వి.రత్న

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో పోలీసులు అందరూ సమిష్టిగా పని చేయడం వల్ల నేరాలు తగ్గాయని, ఇదే స్ఫూర్తితో కొత్త సంవత్సరంలో మరింత బాగా పనిచేయాలని ఎస్పీ వి .రత్న తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం డీఎస్పీలు, సిఐలతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ాంతిభద్రతల పరిరక్షణలో ఇదే స్ఫూర్తితో 2025 సంవత్సరంలో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎస్పీ సూచించారు. సబ్ డివిజన్ల వారీగా వివిధ కేసులపై ఎస్పీ సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రించాలన్నారు. అనంతరం వివిధ కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. 35 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణ స్వామి, ఎస్‌బి సిఐ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై సిపిఎం వినతి

ముదిగుబ్బ : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నాయకులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యాక్రమంలో తహశీల్దార్ నారాయణ స్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కస్తూరిబా స్కూల్ కాలనీలో పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసి, పంచాయతీ సెక్రెటరీ ద్వారా ఇంటి నెంబర్లు ఇప్పించాలన్నారు. కాలనీలో సిసి రోడ్లు, నీటి సౌకర్యం కల్పించా లన్నారు. రాళ్ల అనంతపురం క్రాస్ సమీపాన జెకే.పల్లి పొలం 51 సర్వే నెంబర్లు అక్రమంగా నిర్మిస్తున్న గహాలను ఆపాలన్నారు. ముదిగుబ్బ రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తూ రద్దైన రైళ్లలను పునరుద్ధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, పోతులయ్య, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్, టైలర్ ముత్తు, రహీం పాల్గొన్నారు.

రాగి పంట సాగుతో ఆదాయం

ఓబుళదేవరచెరువు : తక్కువ పెట్టుబడి ద్వారా రాగి పంటను సాగు చేయడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఎడిఎలు ఆర్.సత్యనారాయణ, సనావుల్లా తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో రాగిపంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాగి పంటను ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.4290తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఇలియాజ్, విఎఎ ఆంజనేయులు నాయక్, సివిల్ సప్లయ్ సిబ్బంది ఖాసిం, రైతులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి-రొద్దం



గుంతల రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి సవిత

మండల పరిధిలోని దండేపల్లి క్రాస్ నుంచి నల్లూరు, పెద్దగువ్వల పల్లి వరకు ఉన్న రోడ్డును రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. రోడ్డు మొత్తం ఆమె నడుచుకుంటూ వెళ్లి గుంతలను పరిశీలించారు. దండేపల్లి వద్ద నుంచి పెద్ద గువ్వలపల్లి వరకు రోడ్డు పనులను త్వరలో చేపడతామని ఆమె తెలియజేశారు. అనంతరం నల్లూరు గ్రామంలో నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన చిన్న అంజినప్ప కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి మృతుని కుటుంబానికి రూ. 10వేలు అందజేశారు. కళ్లకుంట గ్రామంలో హనుమంతరాయప్ప ఇంటికి వెళ్లారు. అక్కడ వారు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాధవనాయుడు, కన్వీనర్ నరహరి, చంద్రమౌళి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, రొద్దం మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, చిన్నమంతురు పవన్, శ్రీనాథ్ చౌదరి, టైలర్ ఆంజనేయులు, నల్లూరు నాగరాజు, హనుమంతరాయుడు, డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, ఉమాశంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, గోబ్బరంపల్లి రవి, రొద్దం నరసింహులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ విద్యార్థికి మంత్రి అభినందనలు

అండర్-17 సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నారనాగేపల్లి హైస్కూల్ విద్యార్థి టి.సుకన్యను మంత్రి సవిత అభినందించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. విద్యార్థినితో పాటు పిఇటి మహేష్‌ను సవితమ్మ అభినందించారు.

ప్లాట్ల క్రయవిక్రయాల్లో నిబంధనలు తప్పనిసరి

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

నిబంధనల మేరకు కదిరి మున్సిపాలిటీకి ఆదాయం చెల్లించి ప్లాట్ల విక్రయాలు జరు పుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలో ని ఆర్డీవో కార్యాలయంలో మున్సిపల్ రిజిస్ట్రేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ అధికారపక్షమైన, విపక్షమైనా తప్పు ఎవరు చేసినా ఉపేక్షించే ప్రసక్తి లేదన్నారు. కదిరి పట్టణంతో పాటు రూరల్ పరిధిలో మున్సిపల్, పంచాయతీ అనుమతులు లేకుండా అనధికారికంగా వేసిన లే-ఆవుట్స్ క్రమబద్దీకరణ కోసం మున్సిపల్ ఆదాయం 14 శాతం రుసుం చెల్లించి క్రయవిక్రయాలు జరుపుకోవాలన్నారు. 2019 కన్న ముందు వేసిన లే అవుట్ల క్రమబద్దీకరణ కోసం మున్సిపాల్టీలో టౌన్ ప్లానింగ్, మండల స్థాయిలో తహశీల్దార్‌ను నియమించామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వాటిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ప్లాట్ల విషయములో ఎలాంటి సందేహం ఉన్నా మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్లాట్లు వేసే వారు సైతం నిబంధనల మేరకు ప్రజల కనీస అవసరాలైన రోడ్లు, మురుగుకాలువలు, విద్యుత్, మంచి నీటి సదుపాయం కల్పించాలన్నారు. అనాధికార లేఅవుట్లలో ప్లాట్లనూ ప్రజలు కొనొద్దని ఎమ్మెల్యే సూచించారు.

గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ భూముల కబ్జా

గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేశారని వాటిని వెనక్కు తీసుకుంటామని కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. బెదిరించి బతికిన వాళ్ల ఆటలు కదిరిలో ఇక సాగవన్నారు. సిఅండ్ఐజి చర్చి కుంభకోణానికి మూల కేంద్రం కదిరే అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయమని కలెక్టర్ దష్టికి తీసుకు వెళ్లానన్నారు. పాలనలో పారదర్శకత తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు చేతులు మీదుగా ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ప్రజాశక్తి విలేకరులు బసప్ప, మహేష్, లక్ష్మీనారాయణ, సాయి కృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ ప్రజాశక్తి వాస్తవ కథనాలను ప్రచురిస్తూ ప్రజలకు చేరువగా ఉందన్నారు. క్యాలెండర్లు ఎంత నాణ్యతగా ప్రజలకు ఉపయోపడే సమాచారంతో ఉన్నాయన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

క్రీడలతో మానసిక ఆరోగ్యం

ధర్మవరం టౌన్ : సోషల్ సోల్జర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్మవరం ఆర్‌డిటి గ్రౌండ్‌లో యువతకు క్రీడా పోటీలను సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. యువత, విద్యార్థులు తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.జయ మారుతి, యువ నాయకులు ముక్తం మనిదీప్, పిఇటి రాజేష్, అధ్యాపకులు హరిబాబు, కోచ్ జి.పథ్వి రాజ్, సి.వీరప్ప క్రీడలపై పలు విషయాలు తెలియజేశారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన యువతకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ట్రోఫీ, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

న్యాయవాది మరణానికి కారకులపై చర్యలు తీసుకోండి

పెనుకొండ : అనంతపురంలో న్యాయవాది శేషాద్రి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైఎస్ఆర్‌సిపి లీగల్ సెల్ జాయింట్ సెక్రెటరీ నాగరాజు కోరారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరుతూ జడ్జికి సోమవారం నాడు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలో పోలీస్ స్టేషన్లో న్యాయవాది శేషాద్రి మరణానికి పోలీసులే కారణమని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది సుదర్శన్ రెడ్డిని సైతం పోలీసులు అవమానకరంగా చొక్కా పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లారని తెలిపారు. న్యాయవాదులకు జరుగుతున్న ఈ అవమానకర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సోమవారం పెనుకొండ కోర్టు విధులు బహిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి శ్రీనివాసులు, జి.లక్ష్మి నారాయణ, జావేద్, బాలాజీ, విక్రాంత్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నవ చండీయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మడకశిర : మడకశిరలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి స్వగహంలో మూడు రోజుల పాటు నవ చండీయాగంను నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే రాజు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండి, పంటలు బాగా పండాలన్న ఆకాంక్షతో యాగాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ జయప్ప, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి న్యాయవాది రాధాకృష్ణ, మాజీ సర్పంచి చంద్రప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్లు దాసిరెడ్డి, లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎద్దుల బండిపై వెళ్లి కలెక్టర్‌కు వినతి

పుట్టపర్తి క్రైమ్ : వ్యవసాయానికి తగిన ప్రోత్సాహం అందించి రైతులను కాపాడాలని కోరుతూ పరిగి మండలం శాసనకోటకు చెందిన యువరైతు నవీన్ కుమార్ ఎద్దుల బండిపై వచ్చి కలెక్టర్‌కు సోమవారం నాడు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనకోట నుంచి అమరావతి వరకు ఎద్దుల బండి యాత్ర చేపట్టి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు అన్ని విధాలా సాయం అందించాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి : ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్ : వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సత్యసాయి జిల్లా వైద్యాధికారులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజ్ బేగం ఎమ్మెల్యేను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో వైద్య సేవలపై మాట్లాడారు. వైద్య అధికారులు నిత్యం ఆసుపత్రిలో అందుబాటులో ఉండి సేవలందించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొర్లకుంట ఆంజనప్ప పాల్గొన్నారు.

సంతోషంగా వేడుకలు జరుపుకోండి

ధర్మవరం టౌన్ : 2025 నూతన సంవత్సర వేడుకలను నిరాడంబరంగా, సంతోషంగా జరుపుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ప్రజలను కోరారు. రాప్తాడు, ధర్మవరం రెండు నియోజకవర్గాల ప్రజలు నూతన సంవత్సరం వేళ ఫ్లవర్ బొకేలు, శాలువాలు, స్వీట్ బాక్సుల, కేకులను తమ వద్దకు తీసుకురావొద్దన్నారు. వాటి స్థానంలో మొక్కలు, పిల్లలకు అవసరమైన నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ ఇవ్వాలన్నారు. ఉదయం 9:30గంటల వరకు వెంకటాపురంలో అందుబాటులో ఉంటామన్నారు. 11గంటల తర్వాత ఎమ్మెల్యే సునీత అనంతపురం క్యాంప్ కార్యాలయంలో, పరిటాల శ్రీరామ్ ధర్మవరం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


ధర్మవరంలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

రాజ్యాంగా నిర్మాత డా॥బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయించాలని డిమాండ్ చేశారు.

- మనువాదాన్ని ప్రోత్సహించేలా ఆయన వ్యాఖ్యలు
- అంబేద్కర్, రాజ్యాంగాన్ని విమర్శించినా ప్రధాని నోరుమెదపడా..?
- అమిత్ షా, ప్రధాని మోడీపై వామపక్షాల ఆగ్రహం
- జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

హిందూపురం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమీషా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇందిరాపార్క్ నుంచి పట్టణ పురవీధుల గుండా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జడ్పీ శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించే పద్ధతిలో మాట్లాడిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పడంతో పాటు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకష్ణ, యూనియన్ నాయకులు శివ, ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రమ్మ, జిల్లా కమిటీ సభ్యురాలు గంగమ్మ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు రాయుడు, నారాయణ, నాజియా, షకీలా, ఆదిలక్ష్మమ్మ, సరస్వతి, సుమేర, సల్మా, సానియా, శశికళమ్మ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : హోంమంత్రి అమిత్ షా తనపదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మవరంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా, ఎ.మారుతి, సిఐటియు నాయకులు, జెవి.రమణ, టి.అయుబ్ ఖాన్, సిపిఐ నాయకులు ముసుగు మధు, రవి, వై.రమణ, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు కదిరప్ప, వెంకటనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు రాజా మాట్లాడుతూ దేశంలో ప్రజలందరూ సమాన హక్కులు పొందేందుకు రాజ్యాంగబద్ధంగా అవకాశం కల్పించిన డా॥బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవన్నారు. బిజెపి నాయకులు మనువాద భావజాలం, ఓర్వలేని తనంతో ఇలాంటి వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు. రాజ్యాంగాన్ని సైతం మార్పులు చేయడానికి బిజెపి కుట్రలు చేస్తోందన్నారు. ఇలాంటి వాటిని ప్రజలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, చేనేత సంఘం నాయకులు హరి, వెంకటస్వామి, గుర్రం వెంకటేష్, పోలా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కదరిలో..

కదిరి టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కదిరిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బస్టాండు సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో రాజ్యాంగంపై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవన్నారు. ఇంతటి వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను శిక్షించకుండా ప్రధాని మోడీ మౌనంగా ఉండడం సిగ్గుచేటన్నారు. తక్షణం అమీత్. షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లియాఖాత్, పవన్ కుమార్, రమణ, సిపిఎం నాయకులు జగన్మోహన్, బాబ్జాన్, ముస్తాక్, రఫీ పాల్గొన్నారు.


చిలమత్తూరులో..

చిలమత్తూరు : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నిరసన తెలిపారు. అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు రామాంజనేయులు, సిపిఐ పవిత్ర మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యుడు యోగానంద, పిడిఎఫ్‌యు జిల్లా అధ్యక్షుడు ఉమేష్, సిపిఐ నాయకులు అంజలి, కన్యాకుమారి పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందిస్తున్న ఎంఇఒలు

నియామక పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీ కేటగిరి-3, 4 నాన్ టీచింగ్ స్టాఫ్ రిక్రూట్మెంట్‌లో భాగంగా ధర్మవరం మండలానికి ఈ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న రెండు పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. వీటికి ఎంపికైన విజయలక్ష్మి, కొండ దుర్గా భవానీకి ఎంఇఒలు గోపాల్ నాయక్, రాజేశ్వరి చేతుల మీదుగా ఎంఈఓ కార్యాలయంలో నియామక ఉత్తర్వులను సోమవారం అందించారు.

రాగి పంటపై అవగాహన

ప్రజాశక్తి-అమడగూరు

రాగిపంట సాగుపై మండలంలోని మహమ్మాదాబాద్ గ్రామ సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ మాట్లాడుతూ రాగి, కొర్ర, కొనుగోలుకు ప్రభుత్వం ఒక క్వింటాకు రూ.4290 మద్దతు ధర ఇస్తోందన్నారు. రాగి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి సత్యనారాయణ, డిఆర్‌సి ఏడీ సనావుల్లా, సివిల్ సప్లయి ఖాశీం, మండల వ్యవసాయ అధికారి వెంకటరమణచారి, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాజీ మండల ఉపాధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి-మడకశిర

మాజీ మండల ఉపాధ్యక్షుడు, హరేసముద్రం మాజీ ఎంపిటిసి, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు గోపాలప్ప అనారోగ్యంతో సోమవారం మతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ గోపాలప్ప భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి రమేష్, హనుమంత గౌడ్, మాజీ సర్పంచి నారాయణ ప్ప తదితరులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పరిశుభ్రత చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రంలోని నంది విగ్రహం సమీపంలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత చర్యలు తీసుకుంటామని ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. సోమవారం సాయంత్రం గ్రామ సర్పంచి ఆదినారాయణ, ఎస్ఐ నరేంద్రలతో కలిసి టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా చేయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. పర్యటకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలూ తీసుకోనున్నట్లు తెలిపారు.

ఎంపీడీవోపై దాడి హేయం

ప్రజాశక్తి-రొద్దం

గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి హేయమైన చర్యని స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది తెలిపారు. దాడిని ఖండిస్తూ సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్ కుమార్, ఈవోఆర్డీ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శులు బాబు, లక్ష్మినారాయణ, మోహన్ రాజ్, రఫిక్, జనార్దన్, భక్త వత్సల, రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి తొలగింపు

బుక్కపట్నం : సీజనల్ వ్యాధులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని సర్పంచి నాగలక్ష్మి రాజు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం రైతులు కాలువలు తీసి రోడ్డుపై వేసిన మట్టిని జెసిబిల సాయంతో తీయించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాదిక్ బాషా, సిబ్బంది వెంకటేశుపాల్గొన్నారు.

రైతుకు ప్రోత్సాహం అవసరం

సిడబ్ల్యూసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-పరిగి

రానున్న రోజుల్లో వ్యవసాయం చేయాలంటే రైతు ముందుకు రాని పరిస్థితి తలెత్తే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలని సిడబ్లూసి సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. పరిగి మండలంలోని సేవామందిర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘువీరా ముందుగా లింగణ్ణ సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రసిద్ధ జల స్వప్నం కవి మల్లెలనరసింహమూర్తి రచించిన 'మాకు ఒక నది కావాలి, మట్టి తాంబూర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంటలు నష్టపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో రైతులు సాగుకు దూరం అవుతున్నారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర, నీరు, విద్యుత్ అందిస్తే అన్నదాతలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీటి సమస్యల పరిష్కారానికి నీటి పోరాటాలు అవసరం అన్నారు. ఇలాంటి వాటిలో తానూ పాల్గొంటానని తెలియజేశారు. అనంతరం పుస్తక రచయిత మల్లెల నరసింహమూర్తి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, రిటైర్డ్ డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వరయ్య, బావి కాటి రాఘవేంద్ర, రామలింగప్ప, సుధాకర్ నాయక్, పరిగి ఎంఇఒ లక్ష్మీదేవి, గోరంట్ల ఎంఇఒ గోపాల్, పాలసముద్రం నరసింహులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్.రఘువీరారెడ్డి

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం


ఎస్ఎఫ్ఐ జెండాను ఎగురవేస్తున్న ఆ సంఘం నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం నుంచి విద్యార్థులు, విద్యా సమస్యల పరిష్కారంపై నిరంతరం పోరాటం సాగిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాజాన్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ అనంతరం బాబ్‌జాన్, విజయ్ కుమార్ మాట్లాడుతూ 1970లో కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో ఏర్పడిన ఎస్ఎఫ్ఎ 54 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం నుంచి నేటి వరకు విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో స్కాలర్ షిప్స్ సాధన, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు, సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పన కోసం అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగానే ఈ సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, హర్ష, వినోద్ కుమార్, జిలాన్ బాషా, తాహిర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

ప్రజాశక్తి-మడకశిర


సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని వైద్యులు తెలియజేశారు. పట్టణంలోని వైద్య విధాన పరిషత్‌లో సోమవారం నాడు బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీపై డాక్టర్లకు డిఎంఅండ్ హెచ్ఒ మంజువాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు ఇందులో పాల్గొన్నారు. బాల్య వివాహాల నియంత్రణపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా॥మాధుర్య, డా॥శృతి, డా॥నరేష్ కుమార్, డా॥వినోదకుమార్, డా॥జయవర్ధన్ రెడ్డి, డా॥శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆచూకీ కనిపెట్టండి

ఎస్పీని కోరిన ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నాలుగు రోజుల క్రితం ధర్మవరం నుంచి మచిలీపట్నం రైలులో ప్రయాణించి కనిపించకుండా పోయిన ఇంటర్ విద్యార్థి మనోజ్ కుమార్ ఆచుకీ కనుగొనాలని ఎస్పీ వి.రత్నను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. సోమవారం పుట్టపర్తిలో ఎస్పీని కలిసి ఈ సమస్యపై విన్నవించారు. ఈనెల 26న రామగిరి మండలం కుంటిమద్ది పంచాయతీ శ్రీహరిపురం గ్రామానికి చెందిన 17ఏళ్ల మనోజ్ కుమార్ మచిలీపట్నం రైలులో వెళ్లి కనిపించకుండా పోయాడన్నారు. విజయవాడ జంక్షన్‌లో దిగాల్సిన మనోజ్ ఆచూకీ లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే కుటుంబ సభ్యులు ఈ ఘటనపై విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని అయినా బాలునికి సంబంధించిన ఎలాంటి సమాచారం లేదన్నారు. ఈ సంఘటనను సీరియస్ గా తీసుకుని బాలుడు ఆచూకీ కనుగొనాలని కోరారు.

చట్టాలను దుర్వినియోగం చేయొద్దు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలని, అనవసరంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలను దుర్వినియోగం చేయొద్దని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. సోమవారం మండలంలోని కోడేకండ్ల ఎస్సీ కాలనీలో ఆర్డీటి కమ్యూనిటీ హాల్‌లో సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా ప్రజల ప్రాథమిక హక్కులపై పౌరహక్కుల దినోత్సవ అవగాహన సదస్సును సర్పంచి బండి సరస్వతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలందరూ స్నేహపూర్వక వాతావరణంలో జీవనం సాగించాలన్నారు. ఈ కార్యాక్రమంలో ఏపీఎం సుదర్శన్ రాజు, సీఎస్టీ శారద, కాలనీవాసులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరి

వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. సోమవారం బత్తలపల్లిలో వాహనాలను తనిఖీ చేసి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు.

వీల్‌చైర్ పంపిణీ

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల కేంద్రంలోని ఇందిరా నగర్‌కు చెందిన మూర్తి అనే మానసిక వికలాంగునికి శ్రీ సత్యసాయి బాబా భక్తుల సహకారంతో ఖిద్మత్ ఎ ఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఇందిరానగర్ కాలనీ చెందిన మూర్తి అనే మానసిక వికలాంగుడు నడవలేని స్థితిలో ఇంట్లోనే ఉండడంతో ఆయన పరిస్థితిని గుర్తించి దీనిని అందించారు. ఈ కార్యక్రమంలో షామీర్, మాజీ సర్పంచి సాకే యశోద, సుబ్రహ్మణ్యేశ్వరరావు, శేషు, షమీవుల్లా, శశి కుమార్, సూరి, అశోక్, పాల్గొన్నారు.

రామ లాలిత్యకు సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ కుమార్తె లాలిత్య ఏపీలోని కృష్ణా జిల్లాలో కూచిపూడి గ్రామంలో జరిగిన కూచిపూడి పతాక సర్ణోత్స వాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ లాలిత్య, బాబు బాలాజీని ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ స్వర్ణోత్సవాల నాట్య సభల్లో 2000 మంది కూచిపూడి కళాకారులతో జరిగిన మహా బృందనాట్యం లో రామ లాలీత్య పాల్గొని ప్రతిభ చాటారు.


రామలాలిత్య

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-తాడిమర్రి


నివాళులు అర్పిస్తున్న భవనేశ్వర్‌రెడ్డి

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త బికె.నరేష్(31) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి పాటిల్ భువనేశ్వర్ రెడ్డి సోమవారం ఉదయం మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చాడు. మృతుని కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. మృతుని కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బిసాని లింగమ్మ, లక్ష్మన్న, బిసాని నరసింహులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడుతూ ఔషధాలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరతపై ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేంద్ర, శ్వేత పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో నిలువ ఉన్న సరుకులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

కదిరి టౌన్ : తనకల్లు మండలం బొంతలపల్లి గ్రామానికి చెందిన వైసిపి మాజీ సర్పంచి కె.శారదమ్మ ఆమె కుమారులు కె.మనోజ్ కుమార్, కె.గిరీష్ కుమార్‌లు ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారు. సోమవారం కదిరిలోని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కందికుంట నివాసంలో పార్టీలో చేరారు. వీరికి కందికుంట పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మోపూరి శెట్టి.చంద్రశేఖర్, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి, శంకర్ నాయుడు, రాజారెడ్డి, చంద్రారెడ్డి, పాళ్యం చంద్రశేఖర్, ఆర్.నరసింహ, పి.శంకర్ రెడ్డి, మల్లెపూల రవి, పిజి రవి, వేణు గోపాల్, నారప్పరెడ్డి, మౌల పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే కందికుంట

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం


రికార్డులను పరిశీలన చేస్తున్న అధికారులు

మద్యం దుకాణాల నిర్వహకులు నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరలతో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. సోమవారం అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఏఈఎస్ నరసింహతో కలిసి స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల కల్లు దుకాణాలలో కల్లు శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం చిత్తూరు కెమికల్ ల్యాబ్ కు పంపారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ల్యాబ్‌కు పంపిన పరీక్షల్లో ఎక్కడైనా కల్తీ జరిగినట్లు రుజువైతే కల్తీ కల్లు తయారీ దారులమీద క్రిమినల్ కేసులు నమోదు నమోదు చేస్తామన్నారు. మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పి ధరలకు మాత్రమే విక్రయాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ లక్ష్మీదుర్గయ్య, ఎస్ఐలు పఢ్వీ, ఫరూక్, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, రమణ, సతీష్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్ల ఆంజనేయులు, సుధాకరెడ్డి, శివకుమార్, రవీంద్ర, కుమార్, రంగధామ, ఉస్మాన్, విశాలాక్షి పాల్గొన్నారు.

డ్రిప్ పైపులు అపహరణ

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల పరిధిలోని పాయలవాండ్ల పల్లి ఎన్.హెచ్-42. సమీపంలో ఉన్న రైతు పఠాన్ మస్తాన్ ఖాన్ పొలంలో డ్రిప్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బోరుబావి వద్ద ఉన్న గది తలుపులు పగలగొట్టి వీటిని ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపారు. ఒక ఏడాదిలో మూడు సార్లు తన పొలంలో డ్రిప్ పైపులు, మోటార్, స్ప్రింక్లర్ల దొంగతనం జరిగిందన్నారు. ఈ ఘటనపై బాధితుడు ఎస్ఐ మక్బూల్‌బాషాకు ఫిర్యాదు చేశారు.

స్టార్టర్ అపహరణ

మడకశిర : మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయితీ తురకవాండ్లపల్లి పల్లి గ్రామంలో జగన్నాథ్ అనే రైతు పొలంలో ఉన్న సాగునీటి బోరు స్టార్డర్‌ను దొంగులు ఆదివారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధిత రైతు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెత్త సేకరణ బండి ప్రారంభం

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రంలో పంచాయతీ పరిధిలో ఉన్న చెత్త సేకరణ బండిని సోమవారం ప్రారంభించారు. సర్పంచి ఆదినారాయణ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ ఈ బండి ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు దీనిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఇఆర్‌డి ఆనంద్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి హిందూపురం

రైతులు అందించిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి అందరికీ న్యాయం చేస్తామని తహశీల్దార్ వెంకటేశు రైతులకు భరోసా కల్పించారు. సోమవారం తన కార్యాలయంలో మండల వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాలకు చెందిన రైతులు టిడిపి నాయకులతో కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులను అందించారు. వినతులు స్వీకరించిన అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ఇచ్చిన దరఖాస్తులలో సర్వే నెంబర్లు వారీగా పరిశీలన చేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అమరేంద్ర, టిడిపి మండల కన్వీనర్ అశ్వర్థ రెడ్డి, కిరికెరా మాజీ సర్పంచి రాము, రైతులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయానికి స్థలం పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో టిడిపి జిల్లా కార్యాలయం ఏర్పాటు కోసం అవసరమైన స్థల సేకరణను బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ సోమవారం స్థానిక టిడిపి నాయకులతో పరిశీలన చేశారు. మంత్రితోపాటు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కదిరి, మడకశిర శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, ఆర్డీవో సువర్ణ తదితరులతో కలిసి పరిశీలించారు. బిజెపి కార్యాలయం ఎదురుగా ఉన్న గుట్ట స్థలాన్ని, దుర్గమ్మ గుడి ఎదురుగా ఉన్న గుట్ట స్థలాన్ని, ప్రశాంతి నిలయం పడమటి గేటు సమీపంలో గల స్థలాన్ని, దీం పార్క్ కోసం గతంలో స్థలం సేకరించి వథాగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం ఎంతో అవసరమని అందుకు అవసరమైన స్థలం కోసం పరిశీలిస్తున్నామన్నారు. అనువైన స్థలం దొరికితే కార్యాలయం నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, స్థానిక నాయకులు సామకోటి ఆదినారాయణ, డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్, మండల సర్వేయర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

కుక్కలు, పందులను నివారించండి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల కేంద్రంలో కుక్కలు, పందుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఓడిసి యువ సైన్యం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహశీల్దార్ అనంత ఆచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువసైన్యం సభ్యుడు జహీర్ మాట్లాడుతూ గతంలో చాలాసార్లు ఈ సమస్యలపై అధికారులకు విన్నవించినా పరిష్కరించలేదన్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంట అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో యువ సైన్యం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గౌస్ లాజం, జిలాన్, హరినాథ్ బాబు, జగదీష్, హస్సేన్ వలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి బి.గంగోజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎంపీడీవో కనీసం సమాచారం అడిగినా తెలపడం లేదన్నారు. నిధులు మంజూరు విషయం అడిగితే జూనియర్ అసిస్టెంట్‌ని అడుగమని చెబుతారన్నారు. ఏ విషయం అడిగినా స్పష్టమైన సమాధానం రాదన్నారు. అనంతరం అటవీ శాఖ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కొండలు గుట్టలు అనుమతి లేకుండా ఇష్టానుసారం పనులు చేపడుతున్నారని, ఇలా చేయడం నేరం అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌జెఈ రెడ్డి వరప్రసాద్, పశువైద్యాధికారి నాయక్, ఎపిఎం సూర్యనారాయణ, ఏవో లక్ష్మీప్రియ, ఏపీవో మంజునాథ్, వైద్యాధికారి ఫక్రుద్దీన్, ఎంఇఒ కృష్ణనాయక్, వైస్ ఎంపీపీ భారతి, సర్పంచులు శివప్ప నాయుడు, ఎస్.రహంతుల్లా, ఎంపీటీసీ జయరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని గోవిందురాజులపల్లి గ్రామంలో సాగు చేసిన ఖర్బుజా, దోస పంటలను ఉద్యాన అధికారి ప్రతాప్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వాతావరణ మార్పులతో ఖర్బుజా పంటలకు క్రిమిసంహారక మందులు సకాలంలో పిచికారీ చేయలేదని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాలలో ఖర్బుజా,దోస పంటలను పరిశీలించారని,మండల వ్యాప్తంగా ఈ పంటలు సాగు చేసిన రైతులు నష్టపోతున్నారని తెలిపారు. సరైన సమయంలో మందులు వాడాలని పేర్కొన్నారు. అయన వెంట మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి, గ్రామ సహాయకులు నరసింహారెడ్డి, రైతులు రఘునాథ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

వక్కలిగ సంఘం డైరెక్టర్‌గా ముకుంద గౌడ్

ప్రజాశక్తి-మడకశిర


ముకుంద గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నియోజకవర్గ సమీపంలోని సిరా పట్టణంలో సోమవారం నిర్వహించిన వక్కలిగ సంఘం ఎన్నికల్లో ముకుంద గౌడ్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికల్లో పోటీ చేసిన ముకుందగౌడు భారీ మెజారిటీ సాధించి డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఆయన్ను రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నరసింహగౌడ్, ఎపిఎంసి నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజయరాజు డైరెక్టర్‌గా గెలుపొందారు.